సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 30 । జూలై । 2024



టన్ను చీనీ రూ.17 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,118 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.30
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/23.8°
జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 18 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

స్నేహితుడి హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా
- అనంతపురం మహిళా కోర్టు తీర్పు
- 2015లో జరిగిన ఘటన



కళ్యాణదుర్గం: ఆ నలుగురూ స్నేహితులు. చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. ఈ క్రమంలో వారిలో ఒకడు పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురి గురించీ పోలీసులకు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆ ముగ్గురూ స్నేహితుడని కూడా చూడకుండా దారుణంగా హతమార్చారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హత్య కేసులో అనంతపురానికి చెందిన మారుతి, హనుమంతు, స్వర్ణరాజులకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శోభారాణి సోమవారం సంచలన తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి.

జీవిత ఖైదు పడిన ముగ్గురూ అనంతపురానికి చెందిన భీమేష్‌కు స్నేహితులు. వీరంతా కలిసి చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. ఈ క్రమంలో భీమేష్ పోలీసులకు చిక్కాడు. మిగతా ముగ్గురూ దొంగతనాలలో పాలు పంచుకున్నట్లు పోలీసులకు తెలియజేశాడు. ఈ విషయంలో కోపం పెంచుకున్న ముగ్గురూ భీమేష్‌ను 2015 ఫిబ్రవరిలో కళ్యాణదుర్గం పట్టణ శివారులోని ధర్మవరం రోడ్డు సమీపంలో ఉన్న ఓ మామిడి తోటలోకి తీసుకెళ్లి తలపై రాయితో మోది చంపేశారు. శవాన్ని కూడా గుర్తు పట్టని విధంగా రాయితో బాదారు. ఈ ఘటనపై అప్పటి ఎస్‌ఐ జయ నాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ మన్సూరుద్దీన్ కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ముద్దాయిలపై అభియోగాలు రుజువు కావడంతో ముగ్గురికీ జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం మహిళా కోర్టు జడ్జి శోభారాణి తీర్పు చెప్పారు. అలాగే ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పీపీ సృజన ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. డీసీఆర్‌బీ సీఐ సుబ్రమణ్యం పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ సొరెడ్డి, కానిస్టేబుల్ కృష్ణమోహన్‌లు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేశారు. కేసులో ముద్దాయిలకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ కేవీ మురళీ కృష్ణ అభినందించారు.

రోగులకు నాణ్యమైన సేవలు

- బోధనాస్పత్రి అభివృద్ధికి చర్యలు
- మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు నాణ్యమైన సేవలను అందిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని గైనిక్, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, ఆర్థో, రక్తనిధి కేంద్రాన్ని పరిశీలించారు. రోగులకందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్య కళాశాలలో హెచ్‌ఓడీలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో బోధనాస్పత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. బోధనాస్పత్రిలో 560 పడకలున్నాయన్నారు. సర్వజనాస్పత్రిలో రోజూ ఓపీ 2 వేల నుంచి 3 వేల వరకూ నమోదవుతోందన్నారు. రోగులకు ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమేనన్నారు. ఒక మంచంపై ఇద్దరు బాలింతలు పడుకునే ఇబ్బందికర పరిస్థితులున్నాయన్నారు. ఆస్పత్రిలో మార్పులు తీసుకురావాల్సి ఉందన్నారు. మిల్క్ బ్యాంక్, పార్కింగ్, రోగుల సహాయకులు ఉండేందుకు స్థలం లేదని.. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆస్పత్రి నిర్వహణ బాగుందన్నారు. సూపర్ స్పెషాలిటీలో ఖరీదైన వైద్యం అందుతోందన్నారు. ప్రైవేటులో రూ.10 లక్షల విలువ చేసే సర్జరీని కరీంనగర్ జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తికి ఉచితంగా చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆస్పత్రుల అభివృద్ధికి, నూతన వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు వికసిత్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆస్పత్రిలో ఎంసీహెచ్ బ్లాక్, సర్జికల్ బ్లాక్, సూపర్ స్పెషాలిటీకి పీజీ సీట్ల మంజూరుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మంత్రికి విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారు.

రైలు బండి.. ఎక్కలేమండి!



- శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రం పుట్టపర్తికి రాకపోకలు బాగా పెరిగాయి. రోజూ అనంతపురం నుంచి పుట్టపర్తికి ఉద్యోగ నిమిత్తం సుమారు 300 మంది రైలులో ప్రయాణిస్తారు. సాయంత్రం తిరిగి రైలులోనే వెళ్తారు. అయితే ప్రయాణికులకు అనుగుణంగా రైళ్లలో బోగీలు ఉండటం లేదు. ఎక్స్‌ప్రెస్‌లోనూ కేవలం రెండు లేదా మూడు జనరల్ బోగీలు మాత్రమే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

- విద్య, ఉపాధి కోసం హిందూపురం నుంచి సుమారు వెయ్యి మంది రోజూ రైలులో బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయాన్నే యశవంతపురకు ఓ ప్యాసింజర్ రైలు వెళ్తుంది. ఆ తర్వాత వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెళ్లడం కష్టంగా మారిందని జనం వాపోతున్నారు. జనరల్ బోగీలు అక్కడి నుంచి నిండుగా రావడంతో అడుగు పెట్టలేని స్థితి నెలకొందని చెబుతున్నారు.

- పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి తన పిల్లలను విజయవాడలో చదివిస్తున్నాడు. పండుగ సమయం లేదా వారంతపు సెలవుల్లో ఇక్కడి నుంచి వెళ్లాలన్నా.. అక్కడి నుంచి రావాలన్నా.. కనీసం నెల రోజు ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి. మిగతా సమయాల్లో అయినా కనీసం పది రోజులకు ముందే బుక్ చేసుకోవాలని చెబుతున్నారు. ఉన్నపళంగా వెళ్లాల్సి వస్తే.. చాలా ఇబ్బందిగా ఉంటోందని, తప్పనిసరిగా వెళ్లాలంటే బస్సును ఆశ్రయిస్తున్నట్లు వెల్లడించాడు.

జనం కిటకిట.. బోగీ కటకట

- జిల్లా కేంద్రానికి అరకొర రైళ్లు
- ప్రయాణికులకు రోజూ కష్టాలే
- జనరల్ బోగీలు పెంచాలని డిమాండ్
- నెల రోజులు ముందే బుక్ చేసుకుంటేనే దూర ప్రాంతాలకు టికెట్
- నిత్యం రద్దీగానే నడుస్తోన్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- పుట్టపర్తి, హిందూపురంలో రైళ్లకు భారీ డిమాండ్
- గత ప్రభుత్వంలో పుట్టపర్తికి మూడు రైళ్లు దారి మళ్లింపు
- నేడు కేంద్ర ప్రభుత్వానికి చెప్పలేని స్థితిలో మంత్రులు, ఎంపీ



హిందూపురం రైల్వే స్టేషన్‌లోని టికెట్ కౌంటర్ వద్ద జనం రద్దీ

సాక్షి, పుట్టపర్తి

జిల్లా వాసులకు రైలు ప్రయాణం గగనంగా మారింది. ముఖ్యంగా అనంతపురం నుంచి పుట్టపర్తి, హిందూపురం నుంచి బెంగళూరుకు రైళ్లలో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం నుంచి పుట్టపర్తికి ఒక ప్యాసింజర్ రైలు కూడా లేదు. అరకొరగా ఉండే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు తక్కువగా ఉండటంతో కాలు పెట్టేందుకు చోటు లేని పరిస్థితి. దీనికి తోడు జిల్లా కేంద్రం కావడంతో అనంతపురం నుంచి రోజూ సుమారు 300 మందికిపైగా ఉద్యోగులు రైళ్లలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రైళ్లు సుదూర ప్రాంతాల నుంచి వస్తుండటంతో జనరల్ బోగీలన్నీ నిండిపోతున్నాయని, నెలలో 20 రోజులకు పైగా నిల్చొనే ప్రయాణం చేయాల్సి వస్తోందని జనం వాపోతున్నారు. మరోవైపు హిందూపురం నుంచి బెంగళూరుకు రోజుకు సగటున వెయ్యి మంది ప్రయాణం చేస్తుంటారు. అయితే ఉదయమే ఒక రైలు యశవంతపుర వరకు వెళ్తుంది. ఆ తర్వాత నడిచే రైళ్లన్నీ ఎక్స్‌ప్రెస్‌లు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వేషన్ చేసుకోలేని పరిస్థితి. జనరల్ టికెట్ తీసుకున్నా.. పడరాని పాట్లు పడితే తప్ప ప్రయాణం సాగని పరిస్థితి.

నెలల తరబడి 'వెయిటింగ్'..

పుట్టపర్తి నుంచి విజయవాడ వెళ్లాలంటే నెల రోజులు ముందే ప్లాన్ చేసుకోవాల్సి వస్తోంది. లేదంటే వెయిటింగ్ లిస్ట్‌లో ఉండాల్సిందే. ప్రయాణానికి ఒక్క రోజు ముందు తత్కాల్ కోటాలో టికెట్ కొందామనుకున్నా.. దొరకని పరిస్థితి. స్టేషన్ వద్దకు వెళ్లినా.. భారీ క్యూ ఉండటంతో ఎవరికో చాన్స్ అన్నట్లుగా ఉంటుంది. రూ.వేలల్లో డబ్బులు వెచ్చించి.. బస్సుల్లో పోలేమని భావించిన వారికి రైలు అండగా ఉంటుందనుకుంటే.. అంతకుమించి ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. తత్కాల్‌లో అధిక చార్జీలు, ఏసీ టికెట్లు అందుబాటులో ఉన్నా.. భారీగా సమర్పించుకోవాల్సి వస్తోంది. దీంతో కొందరు బస్సులో వెళ్లేందుకు సుముఖత చూపుతున్నారు.

అప్పట్లో జిల్లా కేంద్రానికి వరాల జల్లు..

పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భవించిన తర్వాత గత ప్రభుత్వం కొత్తగా మూడు రైళ్లను అనుసంధానం చేసింది. బెంగళూరు నుంచి ధర్మవరం వరకు వెళ్లే ప్యాసింజర్‌తో పాటు.. బెంగళూరు నుంచి పుట్టపర్తి వరకు మరో ప్యాసింజర్‌ను తీసుకొచ్చారు. అంతేకాకుండా బసవ ఎక్స్‌ప్రెస్‌ను పుట్టపర్తి మీదుగా దారి మళ్లించి.. ప్రయాణికులకు అవకాశం కల్పించారు. దీంతో చాలామంది పాలకులు మంచి పని చేశారని కొనియాడారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఓ ఎంపీ ఉన్నా.. ఇప్పటికీ రైలు ప్రయాణికుల సమస్యల గురించి ప్రస్తావించిన దాఖలాలు లేవు.



ధర్మవరంలో బుకింగ్ కౌంటర్‌లో జనం



పుట్టపర్తి రైల్వే స్టేషన్ వద్ద...

టికెట్లు దొరకడం కష్టమే



విజయవాడ వెళ్లాలంటే నెల రోజులు ముందే ప్లాన్ చేసుకోవాలి. ఉన్నపళంగా వెళ్లాలనుకుంటే రైలు టికెట్లు దొరకడం కష్టం. ఇప్పటికే నేను చాలాసార్లు టికెట్లు దొరక్క... ఎక్కువ డబ్బులు చెల్లించి బస్సుల్లో వెళ్లాను. రైళ్ల సంఖ్య పెంచడంతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య కూడా పెంచితే బాగుంటుంది.
– హరికృష్ణ, పుట్టపర్తి

ఇబ్బందులు పడుతున్నాం



ఉద్యోగ రీత్యా తరచూ..బెంగళూరు వెళ్తుంటాను. జనరల్ బోగీల్లో చాలా రద్దీ ఉంటోంది. అడుగు కూడా పెట్టలేని స్థితి. గత్యంతరం లేక.. నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. సుమారు రెండున్నర గంటల పాటు నిలుచుకుని ప్రయాణిస్తున్నా. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు మరిన్ని పెంచాలి. రైళ్ల సంఖ్య కూడా పెంచితే బాగుంటుంది. – అరుణ్, హిందూపురం

అందుబాటులోకి తెస్తే మేలు



అనంతపురం వైపు నుంచి పుట్టపర్తికి ఉదయం పూట మాత్రమే రైళ్లు నడుస్తున్నాయి. అదేవిధంగా అనంతపురం వైపునకు వెళ్లాలంటే సాయంత్రం వేళల్లో మాత్రమే రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో అటు నుంచి ఇటు ఉన్న తరహాలో ఇటు నుంచి అటు వైపు వెళ్లేలా కనీసం రెండు రైళ్లను అందుబాటులోకి తేవాలి.
– శ్రీనాథ్‌రెడ్డి, పెడపల్లి

పింఛన్ల పంపిణీ ఒక్క రోజే

- చంద్రబాబు సర్కార్ నిర్ణయం

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీని చంద్రబాబు సర్కార్ ఒక్కరోజుకే పరిమితం చేసింది. గత వైఎస్సార్ సీపీ సర్కార్ పింఛన్ పంపిణీకి ఐదు రోజులు గడువు ఇవ్వగా, కూటమి సర్కార్ మాత్రం ఒక్కరోజే అంటూ మెలిక పెట్టింది. 1వ తేదీ పింఛన్ తీసుకోని వారి నగదు రెండో తేదీన తిరిగి సెర్ప్‌కు చెల్లించాలని కలెక్టర్ చేతన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పింఛన్ పంపిణీ ప్రక్రియ అంతా తొలిరోజే పూర్తి చేయాలని, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే తప్ప రెండో రోజు పంపిణీ చేయకూడదన్నారు. ఈ నేపథ్యంలో పింఛన్ పంపిణీకి రెండు రోజుల ముందే గ్రామాలు, పట్టణాల్లో మీడియా, ఇతర సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

పర్యవేక్షణ తప్పనిసరి..

ఇప్పటికే సచివాలయాల వారీగా ఆయా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు పింఛన్ లబ్ధిదారుల వివరాలు పంపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన పంచాయతీ సెక్రెటరీలు, వార్డు సెక్రెటరీలు బ్యాంకులకు వెళ్లి నగదు తీసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ డివైస్‌ల సమస్య ఉంటే యానిమేటర్, సీసీలను సంప్రదించి అందుబాటులో ఉన్న మరో డివైస్ తీసుకోవాలన్నారు. 1వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభం కావాలని, ఎంపీడీఓలు, కమిషనర్లు తప్పక పర్యవేక్షించాలన్నారు. మిగిలిన మొత్తాన్ని 2వ తేదీ సెర్ప్‌కు తిరిగి చెల్లించాలని ఆదేశించారు. జిల్లాలో 2,70,853 మంది సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారులుండగా, రూ.116.19 కోట్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తాన్ని మొదటి రోజే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యలపై అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కార వేదిక ఉద్దేశం కూడా అదేనన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో జేసీతో పాటు డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 221 అర్జీలు అందగా, వాటిని ఆయా శాఖలకు పంపారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, ప్రజలు ఎంతో నమ్మకంతో కలెక్టరేట్ వరకూ వస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం అధికారులతో జేసీ సమీక్షించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందిన అర్జీల్లో కొన్ని...

- నాబిడ్డ పేరు సతీష్ నాయక్, 9 ఏళ్ల వయస్సు వచ్చినా నడవలేడు, మాట్లడలేడు. 90 శాతం వైకల్యం ఉన్నట్లు సదరంలో సర్టిఫికెట్ ఇచ్చారు. అయినా అధికారులు పింఛన్ మంజూరు చేయలేదని పెనుకొండ మండలం అడదాకులపల్లికి చెందిన శాంతిబాయి కన్నీటి పర్యంతమయ్యారు. తమకు న్యాయం చేయాలని జేసీ అభిషేక్ కుమార్‌ను వేడుకున్నారు.
- తన తాత సుబ్బన్న, అవ్వ లక్ష్మక్కల పేరు మీద ఉన్న 3 ఎకరాల ఆస్తికి తన చిన్నాన్న మలిగి ఆదెప్ప ఎవరికీ తెలియకుండా పట్టా పొంది పాస్ పుస్తకాలు చేయించుకున్నారని నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన వెంకటాచలపతి జేసీకి ఫిర్యాదు చేశారు. సుబ్బన్న మనమడినైన తమనూ భాగం ఇవ్వాల్సి ఉన్నా... పలకడం లేదని, అధికారులు కూడా న్యాయం చేయడం లేదన్నారు.
- 2008–2012 మధ్య జారీ చేసిన సదరం సర్టిఫికెట్లలో పలు తప్పులు దొర్లాయని, ప్రస్తుతం సంక్షేమ పథకాలకు ఇది అడ్డుగా ఉందని పలువురు దివ్యాంగులు జేసీకి ఫిర్యాదు చేశారు. జిల్లాలో సుమారు 5 వేల మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. దివ్యాంగులకు ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాలు మంజూరు చేయాలని, పరికరాలు అందేలా చూడాలని కోరారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



గుండుమల వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

- గుండుమలలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ

మడకశిర రూరల్: సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. ఈ నెల 1వ తేదీన సీఎం చంద్రబాబు సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేసేందుకు గుండుమలకు రానున్న నేపథ్యంలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం డీఐజీ షిమోషి, కలెక్టర్ చేతన్, ఎస్పీ వి.రత్న, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ గుండుమలలో పర్యటించారు. హెలిప్యాడ్ స్థలాన్ని, వేదిక ఏర్పాట్లను వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఎస్సీ కాలనీలో గుర్తించిన పింఛన్‌లబ్ధిదారుల ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. సీఎం పరిశీలన కోసం గుర్తించిన మల్బరీ షెడ్ వద్ద రైతులతో మాట్లాడారు. అనంతరం అధికారులు, గ్రామ ప్రజలతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటించే ఎస్సీ కాలనీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎస్పీ రత్న బందోబస్తు ఏర్పాట్లపై సీఐలు, ఎస్‌ఐలతో సమీక్షించారు. వీరి వెంట డీఎస్పీ షేక్‌బాబీజాన్‌సైదా, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయకుమార్, డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి, నోడల్ ఆఫీసర్లు శివారెడ్డి, సమత, సీఐలు మనోహర్, రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వంద రోజుల 'ఉపాధి' కల్పించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

మడకశిర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలందరికీ వందరోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ 1వ తేదీ ఉదయం 5.30 గంటలకు ప్రారంభించి అదే రోజు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పనిచేసిన కుటుంబాల సంఖ్య పెరగాలన్నారు. ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, గ్రామ కార్యదర్శులు, ఈఓపీఆర్‌డీలు ఉదయం వేళల్లో పారిశుధ్యం పనులను పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పీఆర్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, చిత్రంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

వన్ యాప్‌లో నమోదు ప్రక్రియను డీపీఓ పరిశీలించాలని, ఓడీఎఫ్ ప్లస్ పనులు వేగవంతం చేయాలన్నారు. డీపీఓ, అహుడా అధికారులు సంయుక్తంగా అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్ పర్యాటకశాఖ, మండల ప్రజా పరిషత్‌లకు సంబంధించిన విశ్రాంతి భవనాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విశ్రాంతి భవనాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు.

లారీని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- 9 మందికి గాయాలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై 'వై' జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో 9 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా... కర్నూలు జిల్లా ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 16 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి శ్రీశైలానికి బయలుదేరింది. ఆదివారం అర్ధరాత్రి పెనుకొండ 'వై' జంక్షన్ వద్దకు చేరుకుంది. ఆ సమయంలో రోడ్డు దాటుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న ముస్తాక్, కర్నూలుకు చెందిన గురుప్రసాద్, సావిత్రి, స్వాతి, లారీ డ్రైవర్ నల్లప్ప మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందుభాగం బాగా దెబ్బతినగా డ్రైవర్ వెంకటేశ్వర్లు వాహనంలోనే ఇరుక్కుపోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు అతికష్టమ్మీద అతన్ని బయటకు తీశారు. క్షతగాత్రులందరినీ పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



తీవ్రంగా దెబ్బతిన్న లారీ, బస్సు ముందుభాగాలు



బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

లేపాక్షి: మండలంలోని తిలక్‌నగర్‌కు చెందిన దేవరాజు(25) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... దేవరాజ్‌కు భార్య నాగమణి, రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. భార్య పలుమార్లు ప్రాధేయపడినా తాగుడు మానేయలేదు. దీంతో విసుగు చెందిన ఆమె నాలుగు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. దీంతో ఒంటరి జీవితంపై విరక్తి పెంచుకున్న దేవరాజ్ సోమవారం ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గోపి అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

తలుపుల: మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన భూషణ(42) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సోమవారం చేపల పట్టేందుకు వెళ్లిన ఆయన మూర్ఛ (ఫిట్స్) రావడంతో బావిలో పడి నీట మునిగాడు. పశువుల కాపరుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని వెలికి తీసేలోపు మృతి చెందాడు. ఘటనపై భూషణ భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రోప్ జంప్ పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో ఎస్టీ ఆశ్రమ పాఠశాల సిబ్బంది

నల్లమాడ: ఈ నెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రోప్ జంప్ పోటీల్లో స్థానిక ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలను సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు రోప్ జంప్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ సోమవారం తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ఈవెంట్‌లో ఎం.జయంత్‌నాయక్, యుఎక్స్30 సెకెండ్స్ ఈవెంట్‌లో బి.వివేక్‌కుమార్‌నాయక్ బంగారు పతకాలు సాధించారు. వీరిని హెచ్ఎం సతీష్, పీడీ ధరణి, వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ అభినందించారు. అలాగే నల్లమాడలోని పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-12 డబుల్ ఈవెంట్‌లో ఎం.సుదీప్‌రెడ్డి, 4X30 సెకండ్స్ ఈవెంట్‌లో సి.బద్రీనాథ్, డి.జీవన్, అండర్-14 ఎల్‌ఆర్‌ఎస్ ఈవెంట్‌లో ఎ.సుదీప్, ఇ.వంశీ, ఎం.సుదీప్‌రెడ్డి మొదటి స్థానాల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ హనీఫ్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆ పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరెస్పాండెంట్ స్వర్ణలత అభినందించారు.

డ్యూయల్ డిగ్రీకి 13 అడ్మిషన్లు



అడ్మిషన్ పొందిన విద్యార్థులతో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ), బ్లెకింగ్ వర్సిటీ (స్వీడన్) డ్యూయల్ డిగ్రీ కోర్సుకు 13 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. అర్హత సాధించిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను సోమవారం రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య అందజేశారు. బీటెక్ కోర్సులో మూడేళ్లు జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో, చివరి సంవత్సరం స్వీడన్‌లో వీరు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎంఎస్ ప్రోగ్రాంను స్వీడన్‌లో చేయవచ్చు. కార్యక్రమంలో ఫారిన్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, అడ్మిషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా టీబీ డ్యాం

- ఇప్పటికే హెచ్చెల్సీకి నీటి విడుదల
- సేద్యం పనుల్లో ఆయకట్టు రైతుల నిమగ్నం
- ఆగస్టు రెండో వారంలో సాగునీటి సలహా మండలి సమావేశం



నీటితో తొణకిసలాడుతున్న తుంగభద్ర డ్యాం

రాయదుర్గం/బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి, సాగర, హొసనగర, కడూరు ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టలేదు. దీంతో తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతోంది. సోమవారం ఉదయం 6 గంటలకు ఇన్ ఫ్లో 1,56,780 క్యూసెక్కులు నమోదైంది. రాత్రికి ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 33 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,56,248 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వివిధ కాలువలకు 8,767 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అందులో హెచ్ఎల్‌సీకి 775 క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. మంగళవారం నుంచి వెయ్యి క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

చురుగ్గా ఖరీఫ్ పనులు

హెచ్ఎల్‌సీ నీరు జిల్లాను తాకిన నేపథ్యంలో కాలువ పరివాహక ప్రాంతంలో ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బోర్ల కింద ముందస్తుగా పెంచుకున్న వరి నార్లు నాటేందుకు కొందరు పెంటమళ్లు సిద్ధం చేశారు. ఈ సారి ముందస్తుగా నీరు రావడంతో అన్ని పనులు త్వరగా ముగిస్తామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నీటికి ఢోకా లేదు..

ఇటీవల సమావేశమైన టీబీ బోర్డు 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి తుంగభద్ర జలాశయంలో 172 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని అధికారులు అంచనాకు వచ్చారు. హెచ్ఎల్‌సీ వాటాగా 26.36 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికీ వరద ప్రవాహం కొనసాగుతుండడంతో కేటాయించిన నీరు పూర్తి స్థాయిలో రానున్నాయి. ఈ క్రమంలో సుమారు లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు సాగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

ఆగస్టు రెండో వారంలో ఐఏబీ సమావేశం

జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమీక్ష సమావేశం వచ్చే నెల ఆగస్టు రెండో వారంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. సాగుతో పాటు తాగునీటికే పెద్దపీట వేసేలా కార్యాచరణ చేపడుతున్నారు. అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వ ఇలా..	
ఇన్‌ఫ్లో	1,56,780 క్యూసెక్కులు
డ్యాం నీటి నిల్వ సామర్థ్యం	105.788 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	97.410 టీఎంసీలు
ఈ ఏడాది నీటి పంపకాలు ఇలా..	
హెచ్ఎల్‌సీ	770 క్యూసెక్కులు
పీఏబీఆర్	400 క్యూసెక్కులు
జీబీసీ	120 క్యూసెక్కులు
కణేకల్లు ఎస్ఎస్ ట్యాంకు	50 క్యూసెక్కులు

ఇబ్బంది ఉండకపోవచ్చు..

తుంగభద్ర జలాశయానికి వరద ఇంకా కొనసాగుతుండడంతో ఈ ఏడాది సాగు, తాగు నీటి అవసరాలకు ఇబ్బంది ఉండకపోవచ్చు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆగస్టు రెండో వారంలో సాగునీటి సలహా మండలి సమావేశం జరుగుతుంది. హెచ్ఎల్‌సీ నీటిని ఎలా వాడుకోవాలనే విషయంపై ఇందులో చర్చిస్తారు. ప్రస్తుతం టీబీ డ్యాం నుంచి 775 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఈ క్రమంలో తాగు నీటి అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నాం.

– మద్దిలేటి, హెచ్ఎల్‌సీ, డీఈ

వరుస దాడులు చేస్తున్నా పట్టించుకోరా?



విలేకర్లతో మాట్లాడుతున్న బాధితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు



పిల్లలతో కలసి ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రాజేశ్వరి

- దళితులపై ఐదు రోజులుగా సాగుతున్న దాడులను ఖండించిన ఎమ్మార్పీఎస్
- పోలీసు 'స్పందన'లో ఫిర్యాదు

పుట్టపర్తి టౌన్: లేపాక్షి మండలం కొండూరు ఎస్సీ కాలనీలో ఐదు రోజులుగా దాడులు జరుగున్న పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు మండిపడ్డారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ సోమవారం బాధితులతో కలసి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి విజయకుమార్, ప్రకాష్ , కేఎస్ బాబు తదితరులు మాట్లాడారు. కుటుంబ కలహాలు, పార్టీ కార్యకలాపాల నేపథ్యంలో కొండూరు గ్రామానికి చెందిన మాదిగ సిద్ధప్ప కుటుంబంపై అదే గ్రామానికి చెందిన గురుమూర్తి, ఆయన అనుచరులు వరుస దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలు, చిన్నారులు, దివ్యాంగులని కూడా చూడకుండా దౌర్జనం చేస్తున్నారన్నారు. దీనిపై లేపాక్షి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేసినా... రాజకీయ ఒత్తిళ్ల కారణంగా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై ప్రశ్నిస్తే బాధితులపైనే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు.

38 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 36 వినతులు అందాయి. డీఎస్పీలు వాసుదేవన్, శ్రీనివాసరావు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

ప్రాణ రక్షణ కల్పించండి..

'నా భర్త రెండో పెళ్లి చేసుకుని నన్ను, నా బిడ్డలను చంపుతానని బెదిరిస్తున్నాడు. ఎలాగైనా మాకు రక్షణ కల్పించండి' అంటూ అమడుగూరు మండలం నిలువురాతిపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి వేడుకుంది. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం నిలువురాతిపల్లికి చెందిన రమణప్పతో రాజేశ్వరికి వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న రమణప్ప... భార్యాపిల్లలను నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. పెద్ద మనుషులు జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. 20 రోజుల క్రితం సదరు మహిళను పిలుచుకెళ్లిన రమణప్ప, ఆమెను పెళ్లాడి వాట్సాప్ ద్వారా ఫొటోలు పంపి తాము వచ్చేసరికి ఇల్లు విడిచి వెళ్లాలని, లేకపోతే హతమారుస్తానంటూ బెదిరిస్తున్నాడని పోలీసు అధికారుల ఎదుట రాజేశ్వరి వాపోయింది. స్పందించిన డీఎస్పీ సంబంధిత ఎస్‌హెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలికి న్యాయం చేకూరేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



పోస్టర్లను విడుదల చేస్తున్న రామకృష్ణ, తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే జీపు జాతను జయప్రదం చేయాలంటూ ముద్రించిన పోస్టర్లను సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.... ఆరు నెలలుగా మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు అందక హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ హాస్టళ్లకు వెంటనే కొత్త భవనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, నాయకులు జాఫర్, ఏఐఎస్ఎఫ్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలించాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వైద ఆరోగ్య శాఖ అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆరోగ్యకరమైన పిల్లల భవిష్యత్తుకు నులి పురుగులను నిర్మూలించాలని, ఇందుకోసం ఆగస్టు 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో నులి పురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కొంకి, నులి, బద్దె, గుండ్రని పురుగులను నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యం , పెరుగుదల మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 3,74,171 మంది ఉన్నారని, వీరికి ఆగస్టు 20, 28న నులిపురుగుల మాత్రల పంపిణీ చేయాలని సూచించారు. 1 నుంచి రెండేళ్ల లోపు వయస్సు చిన్నారులకు అర మాత్రను అర్ద పొడి చేసి మింగించ వచ్చునన్నారు. 2 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు 400 ఎంజీ ఒక మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత మింగించాలన్నారు. డీఎంహెచ్‌ఓ మంజువాణి మాట్లాడుతూ... ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం అనే నినాదంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఆగస్టు 20న మాత్రలు వేసుకోని వారిని గుర్తించి 28వ తేదీన వేయడం జరుగుతుందన్నారు. అనంతరం డీఆర్‌ఓ కొండయ్య, ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ నివేదిత, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీపీఎం కుళ్లాయప్ప నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, డీహెచ్‌ఓ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థులు

నార్పల: పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయిన వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆచూకీని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి సకాలంలో గుర్తించి, వారిని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు.. నార్పల మండలం దుగుమర్రి గ్రామానికి చెందిన గరుడశేఖర్‌రెడ్డి కుమారుడు జగదీశ్వర్‌రెడ్డి అనంతపురంలోని గ్లోబల్ స్కూల్‌లో ఆరో తరగతి, నార్పల నివాసి మధు కుమార్తె సాయికీర్తన... అనంతపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటికి వచ్చిన వీరిద్దరూ సోమవారం పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక ఇంటి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్నా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఆయా గ్రామ పరిసరాల్లోనే విద్యార్థులను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.



జగదీశ్వర్‌రెడ్డిని తండ్రికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

మా బిల్లులు చెల్లిస్తారా... లేదా?

- తహసీల్దార్‌ను అడ్డుకున్న వాహన డ్రైవర్లు



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వాహన డ్రైవర్లు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ పనులన్నీ వదులుకుని రేయింబవళ్లు విధులు నిర్వర్తిస్తే రెండు నెలలైనా తమకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే బిల్లులు చెల్లిస్తారో... లేదో చెప్పాలంటూ తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ప్రైవేట్ డ్రైవర్లు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. వాహన డ్రైవర్లు, ఫొటో, వీడియో గ్రాఫర్లు, వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలు, చివరకు అధికారులకు భోజనం పెట్టిన హోటల్ యజమానికి సైతం రూ.లక్షల్లో బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. పుట్టపర్తి నియోజకవర్గంలో వాహన డ్రైవర్లకు రూ.6 లక్షలు, భోజనాలు సరఫరా చేసిన హోటల్ యజమాని వెంకటేష్‌కు రూ. 3 లక్షలు, వీడియో గ్రాఫర్లకు రూ.4 లక్షలు, వీఆర్‌ఏలకు సుమారు రూ.1 లక్షకు పైగా, ఇక అధికారుల ప్రోటోకాల్‌కు, ఇతర ఖర్చులకు అప్పుగా తీసుకున్న మొత్తం, వీఆర్‌ఓలకు చెల్లించాల్సిన బకాయిలు మరో రూ. 10 లక్షల వరకు ఉన్నాయి. వీటిని చెల్లించకుండా తహసీల్దార్ వేణుగోపాల్ రిలీవ్ అవుతున్నట్లు తెలుసుకున్న డ్రైవర్లు ధర్నా చేపట్టారు. తహసీల్దార్ ఎక్కడికీ వెళ్లకుండా కారుకు అడ్డుగా బైఠాయించారు. తహసీల్దార్ ఎక్కడికి వెళ్తే అక్కడికి అనుసరిస్తూ చివరకు సాధించుకోలేక తీవ్ర అసహనానికి గురై కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఎన్నికల ఖర్చులకు గాను నియోజక వర్గానికి సుమారు రూ.1.40 కోట్లు నిధులు వచ్చినా ఇవ్వలేదని సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'పీఏబీఆర్'లోకి తుంగభద్ర జలాలు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లోకి సోమవారం తుంగభద్ర జలాలు చేరుకున్నాయి. హెచ్చెల్సీ ద్వారా 355 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుకుంటున్నట్లు నీటి పారుదల శాఖ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.452 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంతపురం, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 55 నుంచి 65 క్యూసెక్కుల వరకూ నీటిని విడుదల చేస్తున్నారు.

పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానం అవసరం

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానం ఎంతో అవసరం అని రైతులకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. కేవీకే స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రెడ్డిపల్లి కేవీకేలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ జ్యోతి, మెమెంటోను ఆమెకు బనవాసి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, డాక్టర్ చందన, డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

అనంతపురం సెంట్రల్: మార్కెట్ యార్డు కమిటీల కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకాశం జిల్లా దర్శి మార్కెట్‌యార్డులో ఎన్నుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నలుగురు సభ్యులకు అవకాశం దక్కింది. వర్కింగ్ కార్యదర్శిగా సుధాకర్‌యాదవ్ (ఉరవకొండ), ఉపాధ్యక్షుడిగా మారెన్న(అనంతపురం), సహాయ కార్యదర్శిగా ఈశ్వరయ్య (రాయదుర్గం), కార్యవర్గ సభ్యుడిగా ఆదినారాయణ (హిందూపురం)ను ఎన్నుకున్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ సంతోషరావు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఉద్యోగులను ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు ఆదేశించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో ఆయన సమీక్షించారు. ఫీడర్ ట్రిప్పింగ్, బ్రేక్ డౌన్‌పై నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తి స్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా నియంత్రికలు మరమ్మతుకు గురైతే వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సంస్థ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయాలని, చాట్ బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ ద్వారా అధికారుల దృష్టికి సమస్య తీసుకురావడం ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని సూచించారు. వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సురేంద్ర నాయుడు, విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అకౌంట్స్ విభాగపు అధికారులు పాల్గొన్నారు.